సాక్షి
బాపట్ల
శనివారం । 21 । డిసెంబర్ । 2024

ఎస్‌బీఐ ఎండీ అమరా చినగంజాం వాసి



చినగంజాం: దేశంలో ప్రతిష్టాత్మక బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎండీగా మన తెలుగువాడు నియమితులయ్యాడు. ఎండీ అమరా రామమోహనరావుకు బాపట్ల జిల్లా చినగంజాం గ్రామంతో సత్సంబంధాలు ఉన్నాయి. అతనికి దగ్గర బంధువు అయిన అమరా మోహనరావు అందించిన వివరాల ప్రకారం.. అమరా రామమోహనరావు తండ్రి రంగనాయకులు, తల్లి సామ్రాజ్యం కాగా, ప్రస్తుతం ఆమె చనిపోయారు. తండ్రి గతంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఉద్యోగరీత్యా చీరాలలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో రామమోహన్ జన్మించారు. ప్రస్తుతం రంగనాయకులు తెనాలిలోని కొత్తపేట లో నివాసముంటున్నారు. ఆయనకు కుమారుడు రామమోహన్, కుమార్తె ఉష ఉన్నారు. వారికి గతంలో చినగంజాంలో సొంత ఇల్లు ఉండేది. 20 ఏళ్లకు పూర్వం రంగనాయకులు తండ్రి చనిపోవడంతో దానిని అమ్ముకొని వెళ్లిపోయారు. రామమోహన్ చదువుకునే రోజుల్లో చినగంజాం అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవారని మోహనరావు వివరించారు.

సువర్ణ స్వాప్నికుడి అక్షర యజ్ఞం

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. పేదరికం పోవాలంటే చదువే ముఖ్యం అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటల స్ఫూర్తితో విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'అమ్మ ఒడి' ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15,000 అందజేశారు. పేద విద్యార్థులు చదివే బడులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 'నాడు-నేడు' పథకానికి శ్రీకారం చుట్టారు. రూ.వేల కోట్లు ఖర్చుచేసి సర్కారు బడులను సుందరంగా తీర్చిదిద్దారు. పిల్లలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో స్వయంగా మెనూ రూపొందించి అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాలను అటకెక్కించింది.

- నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక వెలవెల
- 'అమ్మ ఒడికి మంగళం పాడిన పాలకులు
- వైఎస్ జగన్ పుట్టినరోజున ఏటా విద్యార్థులకు ట్యాబ్‌లు
- నాడు – నేడుతో ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు
- ఆర్థిక భరోసాతో ప్రతి విద్యార్థి ఇంటా నాడు వెలుగులు
- తలచుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

బాపట్లటౌన్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1417, ప్రైవేట్ పాఠశాలలు 413 ఉండగా ఆయా పాఠశాలల్లో గతేడాది గణంకాల ప్రకారం 1.92 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు సమాచారం.

జగన్ హయాంలో విద్యాభివృద్ధి ఇలా...

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు విద్యాభివృద్ధికి విశేష కృషి చేసింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే పిల్లలకు అమ్మఒడి పథకం ద్వారా విద్యను ప్రోత్సహించింది. ఆపై ఉన్నత చదువులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో వెన్నుదన్నుగా నిలబడింది. పాఠశాల స్థాయి నుంచి సీబీఎస్ఈ నుంచి టోఫెల్ స్థాయిలో విద్యాబోధన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇదే సమయంలో ప్రతి మండలానికి ఇంటర్మీడియేట్ కళాశాల ఉండాలని భావించింది. పిల్లలకు చదువుకు కావాల్సిన వస్తువులను 'జగనన్న విద్యా కానుక' పేరుతో అందించారు. పిల్లలు చదువులో రాణించాలంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో 'జగనన్న గోరుముద్ద' పేరుతో పౌష్టికాహారం అందించారు. అది కూడా రోజుకో మెనూతోపాటు కోడిగుడ్డు, రాగిజావ, చిక్కీ అందజేస్తున్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లోని విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, కిచెన్ షెడ్లు, ఇంగ్లీష్ ల్యాబ్, పెయింట్స్, బోర్ సౌకర్యం, మరుగుదొడ్లు తదితర పనులు చేయించారు.

అమ్మఒడి నిధులు ఇలా		
విద్యాసంవత్సరం	లబ్ధిదారులు	మొత్తంరూ. కోట్లలో
2019-20	1,14,550	రూ.171.82
2020-21	1,16,019	రూ.162.42
2021-22	1,19,953	రూ. 155.94
2022-23	1,17,827	రూ.176.75



కార్పొరేట్ తరహాలో నిర్మించిన బాపట్ల బాలికల ఉన్నత పాఠశాల

వైఎస్ జగన్ పాలనలో విద్యారంగం కళకళ



బాపట్లలో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

జిల్లాలో ట్యాబ్‌ల పంపిణీ

విద్యార్థులకు మెరుగైన విద్యాబుద్ధులు అందించాలనే లక్ష్యంలో 2022–23 విద్యాసంవత్సరంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు కానుకగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రూ.22 వేల విలువచేసే ట్యాబ్‌లు, దానిలో రూ.15 వేల విలువ చేసే బైజూస్ కంటెన్‌ను నిక్షిప్తం చేసి పంపిణీ చేశారు. గరిష్టంగా ఒక్కో ట్యాబ్‌కు రూ.37 వేలు ఖర్చుచేసి పేద విద్యార్థులకు అందించారు.

నాడు-నేడు సమాచారం			
నియోజకవర్గం	మొత్తం పాఠశాలలు	చేసిన పనులు	ఖర్చుచేసిన నిధులు (రూ. కోట్లలో)
అద్దంకి	280	453	75.09
బాపట్ల	210	237	45.08
చీరాల	125	180	38.16
పర్చూరు	263	371	53.70
రేపల్లె	282	381	46.21
వేమూరు	273	424	45.86
మొత్తం	1433	2046	304.1

కూటమి పాలనలో కుంటుపడిన విద్యావ్యవస్థ

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ కుంటుపడింది. మేము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మంది పిల్లలకు రూ.15000 అందిస్తామని మాటలను గాలికి వదిలేశారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నా తల్లికి వందనం అమలు ఊసే లేదు. నాడు–నేడు పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళం పాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

2023-24లో విద్యాదీవెన జమ ఇలా..		
విభాగం పేరు	విద్యార్థుల సంఖ్య	నగదు
ఎస్సీ వెల్ఫేర్	8515	రూ.6,52,12,330
ఎస్టీ వెల్ఫేర్	946	రూ.71,46,077
బీసీ వెల్ఫేర్	10,454	రూ.8,88,90,179
ఈబీసీ వెల్ఫేర్	5089	రూ.4,81,93,828
ముస్లీం మైనార్టీ	1850	రూ.1,54,51,875
కాపు వెల్ఫేర్	2404	రూ.2,19,99,427
క్రిష్టియన్ మైనార్టీ	144	రూ.13,72,193
మొత్తం	29402	రూ. 24,82,65,909

2022-23లో వసతి దీవెన జమ ఇలా..		
విభాగం పేరు	విద్యార్థుల సంఖ్య	నగదు
ఎస్సీ వెల్ఫేర్	8587	రూ.8,03,75,000
ఎస్టీ వెల్ఫేర్	990	రూ.92,25,000
బీసీ వెల్ఫేర్	10,871	రూ.10,36,90.000
ఈబీసీ వెల్ఫేర్	5522	రూ.5,38,10,000
ముస్లీం మైనార్టీ	1892	రూ.1,81,12,500
కాపు వెల్ఫేర్	2613	రూ.2,51,05,000
క్రిష్టియన్ మైనార్టీ	136	రూ.13,27,500
మొత్తం	30,611	రూ. 29,16,45,000

నియోజకవర్గం	ట్యాబ్‌ల సంఖ్య	పెట్టిన ఖర్చు
అద్దంకి	3199	రూ. 11,83,63,000
బాపట్ల	2263	రూ.8,37,31,000
చీరాల	1976	రూ.7,31,12,000
పర్చూరు	2595	రూ. 9,60,15,000
రేపల్లె	2481	రూ.9,17,97,000
వేమూరు	2068	రూ. 7,65,16,000
మొత్తం	14,582	రూ.53,95,34,000



కూటమి సర్కార్ నిర్లక్ష్యంతో నిలిచిన ముత్తాయపాలెం హైస్కూల్ పనులు

పాఠశాలలను అభివృద్ధి చేయాలి



గతంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దారు. కొన్ని పాఠశాలలో పనులు వివిధ దశల్లో నిలిచాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల కోసం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. తల్లికి వందనం అందిస్తే వారికి మేలు జరుగుతుంది.

– యర్రాకుల సుబ్బారావు , జమ్ములపాలెం

తల్లికి వందనం వెంటనే అందజేయాలి



నేను పట్టణంలోని సంపన్నుల ఇళ్లల్లో పాచి పనికి వెళ్తుంటాను. నా భర్త తాపీ పని చేస్తుంటాడు. మాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 3వ తరగతి, రెండో వాడు ఒకటో తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం సొమ్ము ఎప్పుడు జమచేస్తారోనని ఎదురుచూస్తున్నాం. నేను ఇప్పటికే రెండుసార్లు సచివాలయానికి వెళ్లాను. ఎప్పుడు వేస్తారో మాకు తెలియదు అని చెబుతున్నారు. సకాలంలో అందిస్తే మా లాంటి పేదలకు మేలు జరుగుతుంది.

–శిరీష, డ్రైవర్స్‌కాలనీ, బాపట్ల

క్లుప్తంగా

పేదలపట్ల ప్రేమ...జాలి కలిగి ఉండాలి

జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి

బాపట్లటౌన్: పేదల పట్ల ప్రతి ఒక్కరు ప్రేమ...జాలి, దయ కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి అన్నారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండుగ ఉద్దేశం దేవునికి కృతజ్ఞతలు తెలుపుకోవడమే అన్నారు. మనుషులందరూ సహోదర భావంతో కలిసి మెలిసి ఉండటం కోసం మనందరం పండుగలు జరుపుకుంటామన్నారు. ప్రపంచంలో అనేక మతాలు, ధర్మాలు ఉన్నాయన్నారు. ప్రవక్తలు, మహానుభావులు ఈ మతాలను ధర్మాలను స్థాపించి మనకు జీవన మార్గాన్ని, జీవించే క్రమాన్ని చూపించారన్నారు. ప్రవక్తలు, మహానుభావులు ఆదేశించింది సమాజంలో సుస్థిరమైనటువంటి శాంతి, అహింస ఒకరికొకరు పరోపకారులుగా ఉండటం, సహజీవనం గడపటం, ఒక ప్రశాంతమైన సమాజాన్ని ఆకాక్షించి, ఒక ధార్మిక మార్గాన్ని ప్రజలకు సూచించారన్నారు. జీసస్ క్రీస్తు అహింస వాదని, తన మీద దాడి చేసిన వారికి హాని తల పెట్టకుండా ప్రజల శ్రేయస్సు కోసం భరించి నటువంటి వ్యక్తి అన్నారు. భారతీయ ఐక్యత అనేది మనలో ఉన్నది. మనం విభిన్న కుల, మతాలలో ఉన్న కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించే వాతావరణం మన భారతదేశంలో తప్ప మరి ఏ దేశంలో లేదన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వాక, మేజర్ వెంకట్రావు, రెవరెండ్ పి.విజయ రాజకుమార్ పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం జైభీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కర్లపాలెం: ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పిట్టలవానిపాలెం మండల పరిధిలోని గోకరాజు నల్లిపోయినవారిపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పమిడి శివ నాగరాజు (40) ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చందోలు ఎస్సై స్వామి శ్రీనివాస్ తెలిపారు.

వందేళ్ల నాటి రామాలయానికి పూర్వవైభవం

- 100 ఏళ్ల కిందట మూతబడిన సీతారామస్వామి ఆలయం
- రేపు తెరచుకోనున్న ఆలయం
- శిథిలావస్థకు చేరిన ఆలయం
- ఆలయ పునఃనిర్మాణానికి పూనుకున్న చినగంజాం గ్రామప్రజలు
- ఉత్కంఠగా ఎదురు చూస్తున్న జనం



సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



చినగంజాంలోని 100 ఏళ్ల పురాతన సీతారామస్వామి ఆలయం

చినగంజాం: వందేళ్ల పూర్వ వైభవం కలిగిన సీతారామస్వామి ఆలయం ధూప దీప నైవేద్యాలు కరువై మూతబడింది. చినగంజాం గ్రామ నడిబొడ్డున నెలకొని ఉన్న పురాతన ఆలయం సీతారామస్వామి ఆలయం. ఇప్పటివరకు మూతవేసిన పూర్వీకులు భక్తి విశ్వాసాలకు ఒక నిలువెత్తు ఆనవాలుగా మాత్రమే నిలిచిపోయింది. దశాబ్దాలుగా పట్టించుకునే వారు లేకపోవడంతో పూర్తిగా ఆలయం రూపురేఖలు మారిపోయాయి. త్రేతాయుగంలో ఆ సీతారామస్వామికి పాలించే రాజ్యమున్నా అరణ్య వాసం చేయక తప్పలేదు. ఈ సీతారామస్వామికి అనుభవించే ఆస్తులున్నప్పటికీ పూజకు నోచుకోక చిల్లచెట్ల మధ్య దశాబ్దాలు శిక్ష అనుభవించక తప్పలేదు. ఆలయంలో కొలువున్న శ్రీరామచంద్రునికి గ్రామ నడిబొడ్డున చక్కటి నివాసయోగ్యమైన తగినంత స్థలం, ప్రతి ఏటా ఆదాయాన్ని అందించే సుమారు 3 ఎకరాల మాగాణి భూమి, ఆలయం చుట్టూ పలు వర్గాలు ప్రజలు నివాసం, వారందరి ఇంట సుభిక్షమైన ఐశ్వర్యం కలిగి ఉన్నప్పటికీ ఆయనకు కనీస ధూపదీప నైవేద్యాలు దక్కక ఇప్పటి వరకు కునారిల్లుతూ కొనసాగింది.

నెరవేరనున్న చిరకాల కోరిక..

ఎన్నో సంవత్సరాల నుంచి ఆలయ నిర్మాణం చేయాలని ప్రజల చిరకాల వాంఛ తీరేందుకు సమయం ఆసన్నమైంది. ఇందులో భాగంగా స్థానిక భావన్నారాయణస్వామి ఆలయంలో ఉంచిన సీతారామస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను భావన్నారాయణ స్వామి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 2006 నుంచి ప్రతి ఏడారా శ్రీరామ నవమి రోజున కల్యాణోత్సవం వైభవంగా జరిపిస్తూ వస్తున్నారు. గ్రామంలో సీతారామస్వామి ఆలయం ఉండి తీరాలనే సంకల్పం గ్రామస్తులకు కలిగింది. గ్రామ ప్రజలందరూ ఏకమై ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. అనుకున్నదే తడవుగా స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి ఆలయం నిర్మాణానికి ప్రజలు, భక్తుల భాగస్వామ్యంతో దేవదాయ శాఖ అధికారులు రూ. కోటి నగదు అవసరమని ప్రాథమిక అంచనాలు తయారు చేశారు. ఇందుకోసం సీతారామస్వామి దేవస్థానం ఆలయం అభివృద్ధి కమిటీని చినగంజాం గ్రామ ప్రజలు వలివేటి వెంకట రామానుజం, మోటుమర్రి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రజలు 35 శాతం భాగస్వామ్యంతో రూ.35లక్షలు విరాళల రూపంలో సేకరించి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు.

రేపు పురాతన రామాలయం ద్వారం తెరిచే కార్యక్రమం..

చినగంజాం గ్రామంలో రామాలయ నిర్మాణానికి మొదలుగా 100 ఏళ్ల నాటి పురాతన దేవాలయం సీతారామస్వామి ఆలయ ద్వారం తెరచే కార్యక్రమానికి ఆగమ శాస్త్ర పండితులు అగ్నిహోత్రం వెంకట శేషాచార్యులుచే డిసెంబరు 22న ముహుర్తంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా దేవాలయ ద్వారా బంధనం తెరచుట, సింహద్వారం తెరచే కార్యక్రమాన్ని చేపట్టారు. చినగంజాం గ్రామ ప్రజలంతా ఐకమత్యంగా ఉండి చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీరాముని ఆశీస్సులు నిండుగా ఉండాలని గ్రామ ప్రజలంతా భక్తిపూర్వకంగా నిండుమనస్సుతో కోరుకుంటున్నారు.

శోభిల్లిన దేవాలయం..

చినగంజాం గ్రామంలో ఒకప్పుడు ఎంతో వైభవంగా శోభిల్లింది సీతారామస్వామి ఆలయం. చినగంజాం గ్రామంలోని ప్రస్తుతమున్న 12 పంచాయతీల్లో రామాలయం అంటే తెలియని వారు ఉండే వారు కాదు. ముఖ్యంగా రామునిపై భక్తి విశ్వాసాలను ఎక్కువగా చూపే మత్స్యకార గ్రామాలు సైతం రామాలయం లేని పరిస్థితి ఒకప్పుడు కొనసాగింది. అలాంటి పరిస్థితిలో చినగంజాం రామాలయంలో మండల ప్రజలందరూ తమ ఇంట జరిగే శుభకార్యాలను సీతారామస్వామి ఆలయానికి వచ్చి నిర్వహించుకునే వారు. ముఖ్యంగా వివాహాలను సీతారామస్వామి ఆలయంలో నిర్వహిస్తూ ఎంతో సంతృప్తి చెందేవారు. ప్రతి శ్రీరామ నవమి పండుగను గుడిలో ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించుకునే వారు.

శాంతి, భద్రతలకు ముప్పు కలిగితే ఉపేక్షించం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నేరాలను అదుపుచేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



కారంచేడు: గ్రామాల్లో శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కారంచేడు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఇంతవరకు ఎలాంటి కేసులు నమోదయ్యాయి, వాటి పురోగతి, నిరోధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ వీ వెంకట్రావు, పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. అంతకుముందు ఎస్పీ డూడీ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ నేరాలపై సీజ్ చేసిన వాహనాలను కూడా పరిశీలించారు. స్టేషన్ క్రైం రికార్డులను, సీడీలను కూడా ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ, సిబ్బందిని అభినందించారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయో ఆయన అడిగి తెలుసుకున్నారు. వాటి నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలను విని ఆయన మరికొన్ని సూచనలు చేశారు. సిబ్బందితో ఆయన ఒక్కొక్కరితో మాట్లాడారు. వారి సమస్యలు విన్నారు. వారి విధులు, శాఖాపరమైన సమస్యలు విన్నారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్, ఇంకొల్లు సీఐ, కారంచేడు ఎస్ఐ, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తాం

మైనార్టీ విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం



డాక్టర్ గణేష్‌-కేశవతిలను సత్కరిస్తున్న బేగం

రేపల్లె రూరల్/చెరుకుపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తామని మైనార్టీ విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్‌ను శుక్రవారం గుళ్లపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షురాలుగా ఎంపిక చేసిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జునకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈవూరు గణేష్‌-కేశవతి దంపతులను ఆమె సత్కరించారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల ప్రభుకిరణ్, వీవర్స్ విభాగం అధ్యక్షుడు వంగర భానుప్రసాద్, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు తోకల రాజాలు గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యార్డులో 53,675 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 46,813 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 53,675 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది.

ప్రధానమంత్రి పసల్ బీమా పథకం లబ్ధిదారులుగా చేర్చాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రధానమంత్రి పసల్ బీమా పథకం కింద రైతులను లబ్ధిదారులుగా చేర్చాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పీఎం పసల్ బీమా పథకంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకి లబ్ధి చేకూరేలా బీమా పథకాన్ని వర్తింపజేయాలని చెప్పారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు బాపట్ల జిల్లాలో 1.40 లక్షల మంది ఉన్నారన్నారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులు 23 వేల మంది ఉన్నారన్నారు. రైతులే ప్రీమియం చెల్లించేలా చైతన్య పరచాలన్నారు. తద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి జెన్నెమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, సీపీఓ శ్రీనివాస్, ఎల్‌డీఎం శివకృష్ణ, టాటా ఏఐజి ఏజెన్సీ, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరిద్దాం

విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చిన అర్జీలను సానుకూలంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కార కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జరిగింది. వారి నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా మానవతా దృక్పథంతో పరిష్కరించాలని అన్నారు. అర్హత ఉన్నవారికి ప్రభుత్వ పథకాలను అందించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి 11 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలో వరి సాగు ఎన్ని ఎకరాల్లో పంట పండించారు, ధాన్యం దిగుమతి, అమ్మకాలు, నిల్వలపై ఆరా తీశారు. వర్షాభావం కారణంగా నిల్వ ఉన్న ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు రామకృష్ణకు సూచించారు. జనవరి నెల మొదటి వారంలో లక్ష గృహ ప్రవేశాల కార్యక్రమం సందర్భంగా గృహాల ప్రగతిపై మండల ప్రత్యేక అధికారులను, మండల స్థాయి అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. గడువులోపు పూర్తి లక్ష్యాలను సాధించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యత తీసుకోవాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి రూరల్: సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులు బాధ్యత వహించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. శుక్రవారం అద్దంకిలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను మంత్రి స్వీకరించారు. వినతుల్లో వచ్చిన భూ సమస్యలు, విద్యుత్ ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జూనియర్ జిల్లా జట్టు ఎంపిక



ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టు

చినగంజాం: జూనియర్ బాల, బాలికల స్టేట్ చాంపియన్‌షిప్ కబడ్డీ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ క్రీడాకారుల జట్టు ఎంపిక కార్యక్రమం స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈనెల 15వ తేదీ జూనియర్ కబడ్డీ బాలుర జట్టు కోసం క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. జట్టును ఎంపిక చేసి 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, జిల్లా కబడ్డీ కోచ్ ఎం గిరిబాబు నిర్వహించారు. శిక్షణ అనంతరం రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనేందుకు తుది జట్టు ఎంపిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న 50వ ఆంధ్ర జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం గ్రామంలో నిర్వహించనున్నారు. ఎంపికైన జట్టు క్రీడాకారులకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు (ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్) క్రీడాదుస్తులు, శిక్షణ కాలంలో భోజన సదుపాయం అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పూర్ణచంద్రరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ట్రెజరర్ రమేష్‌లు హాజరయ్యారు. వారితో పాటు కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ ఆట్ల స్వామిరెడ్డి, ముసలారెడ్డి, పలపట్ల పోలిరెడ్డి, బోగిరెడ్డి నాగాంజనేయులు, బోగిరెడ్డి శివారెడ్డి, కోట చక్రధర్ రెడ్డి, నిదర శ్రీనివాసరెడ్డి, వాటంబేటీ రాజేష్, పిట్టు బాలకృష్ణారెడ్డి, దేశం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాలుర జట్టు..

ఎస్ మణిరెడ్డి (కెప్టెన్), జీ రామకృష్ణ, జీ లక్ష్మణ్, జీ బాలాజీ, ఏ అశోక్, కే సాయిరాం, జీ మల్లికార్జునరెడ్డి, ఎం సోమేష్, కే ఆకాష్, బీ భవానీశేఖర్, డీవీ మాధవ్, ఏ వెంకీ, పీ బాలకృష్ణారెడ్డి (టీం మేనేజర్), ఎం గిరిబాబు (కోచ్).

22న జిల్లా అండర్-19 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

చెరుకుపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని బాపట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కందుల వెంకటేశ్వరరావు, దుండి నల్లిరెడ్డి తెలిపారు. గుళ్లపల్లి హైస్కూల్లో శుక్రవారం వారు మాట్లాడుతూ ఈనెల 22న గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 9గంటల నుండి బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. వీటిలో ఎంకైనవారు జనవరి 3నుంచి 5వ తేదీ వరకు కర్నూలులో జరిగే 50వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని, అక్కడ రాష్ట్రస్థాయిలో జట్టు ఎంపిక జరుగుతుందని, అక్కడ ఎంపికైనవారు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా జట్టు ఎంపికలో పాల్గొనే వారు, 19సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని, బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ 9000042705, 7893075105, 8096024969, 9989348699 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.నాగాంజనేయులురెడ్డి, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు

చినగంజాం: బాపట్ల జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఖాజీపాలెంలోని కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరుగుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి తెలిపారు. కాలేజీ ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీలలో పాల్గొనే పురుషులు 10 కి.మీ, మహిళలు 10 కి.మీ, అండర్-20 అబ్బాయిలు 8 కి.మీ, అండర్-20 అమ్మాయిలు 6 కి.మీలు, అండర్-18 బాలురు 6 కి.మీ, బాలికలు 4 కి.మీలు, అండర్-16 బాలురు 2 కి.మీ, బాలికలు 2 కి.మీలు లక్ష్యాన్ని పరుగెత్తాల్సి ఉంటుంది. మొదటి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు లేదా వయస్సు ధ్రువీకరణ పత్రం, ప్రతి అథ్లెట్‌కు ఒక వయస్సులో ఒక ఈవెంట్ మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 22 వతేదీ 6 గంటలకు వేదిక వద్దకు రావాలని ఆయన కోరారు.

ఆర్టీసీకి ఇంధన పొదుపు అవార్డులు

సాక్షి, అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ 2024 రాష్ట్ర ఇంధన పొదుపు మిషన్ అవార్డులు సాధించింది. బస్ డిపో విభాగంలో సత్తెనపల్లి డిపోకు గోల్డ్ కేటగిరీ, బస్‌స్టేషన్ విభాగంలో విశాఖపట్నం బస్‌స్టేషన్ సిల్వర్ కేటగిరీ అవార్డులు దక్కించుకున్నాయి. అవార్డులు సాధించిన డిపో, బస్‌స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శుక్రవారం అభినందించారు.

రాయితీతో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్



జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల: ప్రభుత్వ రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులతో నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ జండా ఊపి ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. ఇంధనం అందరికీ అవసరమని ప్రజలు అందరు కూడా జాగ్రత్తగా వినియోగించుకోవాలని అన్నారు. ఇంధనాన్ని ప్రజలు ఆదా చేసి భావితరాల భవిష్యత్తుకు మరింత అందించాలని సూచించారు. ప్రభుత్వం 300 యూనిట్లలోపు గృహాలకు రాయితీపై సోలార్ విద్యుత్తును అందించడానికి చర్యలు తీసుకుందన్నారు. జాయింట్ కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యుత్ విద్యుత్ శాఖ ఇంజినీర్ ఆంజనేయులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెరుగు శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టల్‌లో అపశ్రుతి

వేడి పాలు మీద పడి బాలుడికి గాయాలు

చినగంజాం: వేడి పాలు మీద పడి ఒక బాలుడు గాయాలపాలయ్యాడు. ఈ ఘటన చినగంజాం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో హార్ట్స్ చారిటబుల్ ట్రస్ట్ అనే ప్రైవేట్ హాస్టల్‌ను దాసరి మోహన్‌రావు నిర్వహిస్తున్నాడు. హాస్టల్‌లో ఉంటూ చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పావులూరి వినోద్‌కుమార్ శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో హాస్టల్‌లోని ఆయా పాలు వేడిచేసుకొని పిల్లలకు ఇచ్చేందుకు వస్తోంది. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన బాలుడు వినోద్‌కుమార్ తగలడంతో వేడి పాలు అతడిమీద పడి నడుం దగ్గర తీవ్రంగా కాలి గాయాలపాలయ్యాడు. గాయాలపాలైన అతనిని చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం తరలించినట్లు సమాచారం. సమాచారాన్ని బాలుడి తల్లిదండ్రులు పావులూరి మరియదాసు, లలితకు ఫోన్‌లో సమాచారం అందించారు. చినగంజాంలో నడుపుతున్న హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉంటూ స్థానికంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నట్లు సమాచారం.

జ్వరంతో చిన్నారి మృతి



అద్దంకి రూరల్: జ్వరంతో బాధపడుతూ చిన్నారి గురువారం మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అద్దంకిలోని గాజులపాలేనికి చెందిన కే వర్షిని (10) గాజులపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలలో 5 వతరగతి చదువుతోంది. గురువారం జలుబు, దగ్గు, ఆయాసంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు కొరిశపాడు మండలంలోని రావినూతలలో ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అదే రోజు సాయంత్రం జ్వరం తీవ్రం వచ్చి ప్రాణాలు విడిచింది. పాఠశాలలో, ఇంటి వద్ద ఎంతో చలాకీగా తిరుగుతూ ఆడుతూ ఉండే పాప మృతిచెందడటంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ మధ్యవర్తిత్వం

నగరంపాలెం: మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై జిల్లా కోర్టు ఆవరణలోని డీజే హాల్‌లో నిర్వహిస్తోన్న నలభై గంటల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ సమస్య పరిష్కారంలో కక్షిదారులే కీలక పాత్రధారులని అన్నారు. న్యాయమూర్తులకు శిక్షణ ఇచ్చిన ఆర్.రత్నతార, సత్యారావు (తమిళనాడు)లను సత్కరించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి, న్యాయమూర్తులు పాల్గొన్నారు.